# మా అమ్మ పూల యాపారం

మా అమ్మ కోసే సన్నజాజి పూలని లెక్కబెట్టాలని నాకు బలే కోరిక.

మా అమ్మలాగే మద్యానం మూడు గెంటలకల్లా మా మిద్దెనెక్కి, మా వరండా శ్లాబుకు పొదలు పొదలుగా అల్లుకున్న మా సన్నజాజి చెట్టు పూలన్నింటినీ నేను కూడా కోయాలనీ, కోసినాక పూవు పూవునా లెక్కబెట్టి, నేనే నా సాహస్తాలతో పూల రిహానాబీకి అమ్మాలనీ, ఆ వచ్చే డబ్బుల్ని నా సొంతానికి దర్జాగా వాడుకోవాలనీ సత్తెప్రమాణంగా నిజ్జంగానే నాకు



మహమ్మద్ ఖదీర్ బాబు

బలే కోరిక.

కానీ యాడా? మా అమ్మ ఒకసారి కూడా దాన్ని తీరనివ్వలా. నన్నేగాదు మా అన్ననీ, మా చెల్లెల్నీ ఆకరికి మా వాయినమ్మని కూడా సన్నజాజుల మీద చేయివేయనీదామె. ఎందుకంటే మా చెట్టు మా అమ్మ సొంతం. మా అమ్మ కష్టం.

రోజూ మద్యానం మూడు గెంటలయితే చాలు పెద్ద స్టీలు గిన్నె తీసకొని మిద్దెనెక్కుతుంది మా అమ్మ. ఆ టయానికి మా సన్నజాజుల చెట్టు ఆకు కనిపించనంత తెల్లంగా అంగుళం పొడవు మొగ్గలు కాసి, గమగమమనే వాసనలతో మా అమ్మ కోసరం ఎదురుచూస్తా ఉంటుంది.

మిద్దెనెక్కిన ఎమ్మటన్నే మా అమ్మ వూలుకోయదు. ముందర స్టీలుగిన్నెని కిందబెట్టి ఒకసారి కళ్ళారా వూలన్నింటినీ చూసుకుంటుంది. గాలికి అటూ ఇటూ మిడియాలంగా ఊగి చిక్కుబడిన కొమ్మల న్నింటికీ తీరుబడిగా చిక్కులు తీస్తుంది. ఆడాడ యాడైన చిన్న చిన్న ఎండు కొనలు ఉంటే వుటుకు వుటుకున తుంచి కింద పారేస్తుంది.

ఆనేక – ఒక తీగ కూడా వలగనంత నాజూకుగా – చెట్టుమీదికి వాలి ఒకోవూవూ ఒకోవూవూ కోస్తా గిన్నెలోకి పోయడం మొదలుపెడుతుంది వూలని. మెడ నిలవని పసిబిడ్డని ప్రాణాల్లో పెట్టుకుని ఎత్తు కుంటామే అంత బద్రంగా మా సన్నజాజి కొమ్మల్ని ముట్టుకుంటుంది మా అమ్మ. అమె చేతిలో వూలు తెగాలేగానీ పచ్చికొమ్మ వుటుక్కుమనడానికి లేదు.

వూలు సగానికి కోసేసినాక ఆగి, వూల గిన్నె తట్టు ఓరగా చూసుకుంటుంది మా అమ్మ. అప్పటికి ఉబ్బెత్తుగా సగానికి నిండి వుంటుందది. మిగిలిన సగానికి కూడా నిండేంత వూలున్నాయేమో ఉరా మారీగా చూసుకొని మళ్లా కొరవ వూలన్నీ కోసి గిన్నెలో పోసేస్తుంది.

ఈ కార్యక్రమం అంతా ముగిసేటప్పటికి టయిము అయిదయ్యి మా ఇస్కూలు, మా యింటెదురుగా ఉండే గల్లీస్కూలు యిడిచిపెట్టేసినా మా అమ్మ మిద్దె దిగదు! చెట్టులోకి చూస్తానే వుంటది వూల కోసరం. మా అమ్మ కళ్ళు చినయ్యి. నవ్వితే మూసుకుపో తుంటాయయి. అయినా అమె చూవులో చురుకు బలే జాస్తి. సాయింత్రవ్వాట, ఒక తట్టు ఎండ చల్లబడిపోయినాక కూడా ఒకసారి కళ్లుదిప్పి చెట్టు వంతా చూసిందంటే చాలు. గుబురు లోపల, ఆకు మాటున, కొమ్మ నీడలో యాడన్నా ఒక్క వువ్వు మిగిలినా చాలు మా అమ్మ కంటికి చిక్కిపోతుంది. ఆ ఒక్క వువ్వుని కూడా వదలకుండా కోసేసినాక అప్పుడు మిద్దె దిగుతుంది మా అమ్మ.

ఆడికి – మా అమ్మ వూలు కోసే కార్యక్రమంలో ఒక అంకం ముగిసిపోతుంది.

రెండో అంకం మా వూలని లెక్కబెట్టడం.

మిద్దె దిగినాక, మా వరండా గచ్చుమీద ఒక కాలును సావుకొని ఒక కాలును మడనుకొని కుదురుగ్గా కూచుంటుంది మా అమ్మ. ఆనేక గిన్నెని యిదిలిస్తా వూలన్నింటినీ కుప్పగా కిందబోస్తుంది. మెత్తటి శబ్దం చేస్తా యిన్ని పడతాయయి.

ఆ కువ్వలో నుంచి దఫాకు అయిదు లెక్కన యిరవై దఫాలు లెక్కబెట్టి మొత్తం వందవూల కువ్వని పక్కకి జరిపిపెడుతుంది మా అమ్మ. ఆనేక యింకో యిరవై దఫాలు లెక్కబెట్టి యింకో వందవూల కువ్వని పక్కకి జరువుతుంది. అట్టా వంద, వంద, వంద లెక్కన ఎన్ని కువ్వలైతే అన్ని కువ్వలని వరుసగా పేర్చిపెడ్తుంది.

పేర్చినాక, చూవుడు వేలు సాచి ఒకటి..రెండు.. మూడు అంటా కువ్వలన్నింటినీ లెక్కబెడ్తుంది.

మొత్తం పదహారు వందలో, పదిహేడు వందలో ఉంటాయయి! (యిన్ని వూలు వూయడం అంటే చిన్న కత కాదు. మాది చలవగల్ల చెట్టుకాబట్టి మాకు యిన్ని వూల బాగ్యం పట్టిందిగానీ మా చుట్టు వక్కల సందుల్లో ఏ సన్నజాజి చెట్టయినా ముక్కి మూలిగి ఆరేడు వందల వూల కంటే ఎక్కువ వూయదు).

మా అమ్మ మా చెట్టుకు కాసిన (హీనపక్షం) ఆ పదహారు వందల వూలని మళ్లా గిన్నెలో పోసుకొని, మా యింటికి పర్లాంగు దూరంలో ఉన్న వూల రిహానాబీ యింటికి బయలుదేరుతుంది.

దారిలో మా అమ్మ నడస్తా వుంటే అమె చేతిలో ఏముండాదనేది నరమానవుడు కూడా కనిపెట్టలేడు. పొట్ట దెగ్గిర, కొంగు కిందుగా కప్పేస్తుంది వూల గిన్నెని– దిష్టి తగలకుండా.

మా అమ్మని చూడంగానే రెండు చేతులు సాచి గిన్నె అందుకుంటుంది రిహానా. కళ్ళ నిండుగా వూలు చూసుకుంటానే 'ఎన్నకా?' అని అడుగుతుంది.

'పదహారు' అంటుంది మా అమ్మ.

రిహానా మళ్లా మా వూలని లెక్కబెట్టదు. మా అమ్మ చెప్పిన లెక్కనిబట్టి ఎమ్మటన్నే డబ్బులిచ్చేస్తుంది.

వంద వూలొచ్చి యిరవై పైసలు!

అంటే పదహారు వందల వూలొచ్చి మూడు రూపాయిల యిరవై పైసలు!

ఆ మూడు రూపాయిల యిరవై పైసలని తీసు కున్నాక, పదిలంగా ముడేసి చీరకొంగులో కట్టుకుం టుంది మా అమ్మ.

అయి మా అమ్మ సొంత డబ్బులు!

అదీ మా అమ్మ వూల యాపారం!

నేను ఆరో కిలాస్‌లో మారి, మూడు వెలలు గడిచేసరికి పోలేరమ్మ బండకాడ మా వాయిన శ్లాబుబోసి యిల్లు కట్టించినాడుగానీ యిల్లంటే అది వూర్తి యిల్లుగాదు.

ముందొక తలువు, ఎనకొక తలువు, లోపల వూత పని... యింతే చేయించింది. మేస్త్రోడికి చెప్పినట్టే మా వాయినతో కూడా 'మొత్తం పదేను వేలతో యిల్లయిపోతుంది కరీం సాయిబా' అని బేల్దారు మాలకొండయ్య లెక్క జెప్పినాడంట, ఆ లెక్కని నమ్మి ఏడువేల రూపాయిలతో అమాయికంగా పని లోకి దిగినాడు మా నాయిన. ఆ ఏడయినాయి. డెకరేషన్ లైటింగ్ కోసరం మా దగ్గిరుండే జనరే టరు అమ్మకమాకగా వచ్చిన డబ్బులయినాయి. మా అమ్మ నగలు కుదవయినాయి. యింక ఆపనీ, ఈపనీ చేయంగ వచ్చిన డబ్బులన్నీ అయినాయి. యిల్లు మాత్రం అవలా. పదేనువేలనుకున్న కట్టుబడి అవ్వట్లోనే (కూలోనికి ఆరు, బేల్దారుకు పన్నెండు రూపాయిలిచ్చే 1981 రోజుల్లో) ముప్పయి వేలకి చేరుకునింది. పెండం రవీ, స్నేయితులు, మా తాత మస్తాన్‌సాయిబు లాంటోళ్ళు ఆడక్కముందరే వచ్చి సహాయం చేసినా తట్టుకోవడం మా వాయిన వల్లగాలా.

వాడమ్మనాయాల్ది గానీ యిప్పటికి ఆరిపోయింది చాలు నాలుగు డబ్బులు వచ్చినాక మళ్లా చూసుకో వచ్చు అని, కిటికీలకి రెక్కలు కూడా పెట్టించకుండా మమ్మల్ని దించేసినాడు యింట్లో. ఒకసారి పని పెండింగు పడినాక మా నాయిన దరువు తెలిసిందే కదా. 'చూద్దాం చూద్దాం... చేద్దాం చేద్దామే'.

అందుకని మ అమ్మ మా వాయిన్ని నమ్ము కోకుండా 'వాకిలి గోడ ఎత్తుగన్నా లేదు,ఇంటికొక వరదన్నాలేదు, యీదిన పొయ్యే వాళ్లందరికీ మొత్త మంతా అవుపిస్తా ఉంది' అని, మా ఇంటి వాకిట్లో ఈ నవజాజుల చెట్టునాటింది.

మా అమ్మ చేతి మహిమో, ఆ టయిములోని ముహూర్త బలమో గాని, నాయినా... సంవత్సరం ఆరునెలల్లోనే అది పాకి, పైకి అల్లుకొని, మా వరండా శ్లాబుకి ఆ కొసనుంచి ఈ కొసదాకా పచ్చగా కమ్ముకొనింది. అది ఆకుల పరదాలాగా ఎట్టా అల్లుకునిందంటే బయటి నుంచి చూసేవాళ్ళకి మా వరండా సగం కూడా అవుపించేది గాదు.

అప్పట్నించి మా యింట్లో సాయంత్రమయ్యిందంటే చాలు లెక్కలేనన్ని వూలు. గమగమమనే వాసన.

మా వూలని పెట్టుకొని పెట్టుకొని, మా చెల్లెలికి పెట్టి పెట్టి, వాళ్ళకీ యీళ్ళకీ యిచ్చీ యిచ్చీ యింకీ వూలతో యిసిగిపోయినాము తండ్రీ అని మా అమ్మ అనుకుంటా వున్నప్పుడు వూల రిహానా వచ్చింది మా ఇంటికి.

వూలరిహానా అంటే షావుకారో, లక్పతో అనుకు నేరు. గోతాంపట్టా మీద నీళ్లు చల్లుకొని, అయిదు లీటర్లో, పదిలీటర్లో (మా తట్టు వూలు లీటర్లలో – అంటే లీటర్ డబ్బాల లెక్కన అమ్ముతారు) వూలు తెచ్చుకొని, మాలలుగా కడ్తా వుంటుం దామె. వాటిని బజారులో వరవకట్టమీద కూచొని

వాళ్ళాయన అమ్మతా వుంటాడు. ఆ వూలు అమ్ము డుబోతేనే ఆ రోజుకి జరుగుబాటు. లేకపోతేలా

వరవకట్ట మీదుండే వూలకొట్లకాడ సనజాజి మూరలకి ఉన్న డిమాండును చూసి, మా చెట్టుని చూసి, మా అమ్మ కాడికి వచ్చిన రిహానా తవ బాదంతా చెప్పకునింది.

'అకా. నీకు తెలియనిదేముంది. మా యింటా యన అంతంత మాత్రపోడు. బుట్టకు యిన్నేసి వచ్చే బంతి వూలని కొనడానికి కూడా అల్లాడి పోతా ఉన్నాడు. తక్కిన వూల రేట్లు చూస్తా ఉంటే మాబోటోళ్ళం సరుకు ఏయించుకునేలా లేము. ఏయించుకున్నా పెద్ద వూలకొట్ల మద్యన కూచొని అమ్ముకునేలా లేము. నువు సనజాజులు యిచ్చినావంటే అయి నాలుగు మూరలు ఇయి నాలుగు అమ్ముకొని ఎట్నో గడువుకుంటాం. నీ సొమ్ము వుణ్యానికి బళ్లా. వందకు ఇరవై పైసలిస్తా' అనింది.

ఆమె బాదల కంటే కూడా, వందకు యిరవై పైసలన్నమాటే మా అమ్మను ఎక్కువ కరిగించింది. 'దానికేం బాగ్యంమే రిహానా. అట్టాగే యిస్తా. నీ కోసరం యియ్యాల్టి నుంచి తల్లో కూడా పెట్టుకోను పో' అని మాటిచ్చింది.

ఇచ్చినాక, ఆ రాత్రే, అన్నం తింటా ఉన్న మా వాయిన కాడ నెమ్మదిగా యీ సంగతి కదలేసింది. మా నాయిన బిత్తరపోయినాడు.

'కరీం సాయిబు బార్య వూలమ్మతా ఉందని వలగరూ నాలుగు మాటలు అనుకోబోతారు. వద్దు లేమ్మే. కావాలంటే ఊరకనే కోసుకొని పొమ్మని చెప్పు' అనినాడు.

మా అమ్మకు కాలిపోయింది.

'నువు ఎంకటగిరి రాజా అయివనాడు అట్నే ఊరకే యిద్దూగానీ ఇవ్వదు మాత్రం నేను వూల మ్మతా నువు గమ్మునుండు. ఏదైనా అనుకునే వోళ్లంతా మనకొక రూపాయి యిస్తారా? మన బాదలేముండాయో అంటా వచ్చి పంచుకుంటారా? అయినా యిందులో దాపరికంలా. దొంగతనంలా. వూలుండాయి... యిస్తా ఉన్నాము. రెండు మూడు రూపాయిలొస్తే పాలకయినా పనికొస్తాయి గదా' అని, మా నాయిన మనసుకక్కేలా మాట్లాడింది.

మా వాయిన గమ్మునయిపోయినాడు.

అంతే. ఆ రోజుటాల్నించి మా యీదిలో వాళ్ళకూ మా బంధువులకూ కాదుగదా ఆకరికి మ చెల్లెలికి కూడా ఫుల్లుగా వూల కట కటా. ఒక మొగ్గ పోవడానికి లా. ఒక మొగ్గ రాలడానికి లా. అన్నీ గుత్తంగా తీసకెళ్ళి రిహానాబీకి అప్పగించాల్సిందే. ఎవ్వడైనా మిద్దె మీద నుంచి గానీ, కింద నుంచి గానీ చేతికందకుండా గుప్పెడు వూలు నడిమద్యన మిగిలి పోతే మా అమ్మకు ఎంత బాదో. 'నయా పైసల్లా నాయినా నయాపైసలు... గాలికి పోతా ఉన్నాయి' అనేది.

వూల యాపారం మొదలయినాక మా అమ్మ దిన చర్యే మారిపోయింది. ఆమె ద్యాసంతా ఒకోవూవూ ఒకోవూవూ లెక్కన కావు పెంచి యాపారాన్ని ఎట్టా అబివృద్ది చేయడమనేదే. పొద్దునొక బిందెడు నీళ్లు సాయింత్రమొక బిందెడు నీళ్లు పోస్తా వున్నా ఆ నీళ్లు పీల్చకొని మా చెట్టు పచ్చగా నవనవలాడతా వున్నా మరిగిన్ని వూలు వూయించడానికి ఏం చేయాలో మా అమ్మకు తోచేది గాదు.

మా ఇంటికి కుడితి నీళ్ళ కోసరం వచ్చే ఒక ఆడమనిషి, కుడితి తీసుకుని గమ్మునపోకుండా 'మోవ్! చెట్టుకి టీ ఆకెయ్. సత్తవ' అని చెప్పిందంట, అప్పట్నించి మొదలయినాయి వా పాట్లు.

నాలుగైదు రోజులకొకసారన్నా, ఇస్కూలు మంచి రాంగానే 'సామీ ఓటలుకెళ్ళి టీ ఆకు తేబోరే' అంటా, ప్లాస్టీకు బకెటును చేతిలో పెట్టేది మా అమ్మ. సామీ ఓటల్లో టీ ఆకు మార్చినప్పడల్లా ఉడికిన ఆకుమ తీసి రేకుడబ్బాలో పారేస్తారు గదా దాని తేవాలన్న మాట వేమ.

'దారిన పొయ్యేవోళ్లంతా మన పూలని చూసి కళ్లల్లో నిప్పులు పోసుకుంటా వున్నారు. దిష్టి చూపు తగిలితే బండరాళ్లే పగిలిపోతాయి. పచ్చటి చెట్టుదొక లెక్క' అని మా అమ్మకు దిగులు పట్టుకునింది.

ఆడుకునే టయిములో, సామీ ఓటలు కాడికెళ్ళి టీ ఆకు కోసరం నిలబడాలంటే కర్మగా అనిపించేది నాకు. ఆ టయిములో కిటకిటలాడతా ఉంటుంది ఓటలు. చాలామంది టీలు తాగతా ఉంటారు. అందరికీ టీలు ఇచ్చి, యింక తాగేవోడెవ్వడూ లేడ నుకున్నాక గానీ మనల్ని టీబోసే బండ కాడికి రానీరు. వాళ్లు రానిచ్చాకగానీ నాపరాయి బండ కిందున్న టీ ఆకును తెచ్చుకునేదానికి లేదు. ఇంత తతంతగం ఉన్నా 'నేను పోనుమా' అని మా అమ్మకు చెప్పేదానికిలా. బియ్యం తేనన్నా సయిస్తుంది గానీ చెట్టుకి టీ ఆకు తేనంటే మాత్రం సయించదు మా అమ్మ.

మా సనజాజుల చెట్టు కుదుళ్ళు ఎప్పుడు చూసినా టీ ఆకు ముద్దలతో తడితడిగా ఉన్నా మా అమ్మకు తృప్తి తీరేది కాదు. చెప్పినానే మా పాతూరంతా రెడ్లు, యవసాయం చేసేవోళ్ళు ఎక్కవని... అందువల్ల ఏ యింటి ముందరయినా ఎరువుమట్టితో ట్రాక్టరు ఆగిందంటే చాలు చాటెత్తుకొని సిద్దమయిపోయేది మ అమ్మ. 'రెండు చాటలే లేమ్మా' అంటా ఒకటికి రెండు చాటలు జవురుకొవొచ్చి మా చెట్టుకు పోస్తేనే ఆమెకు నిశ్చింత.

యిట్టా ఎరువుమట్టి, టీ ఆకు, నీళ్ళు తినీ తాగమ రిగి మా సనజాజులచెట్టు బలిసిపోయింది. వూలు కుప్పలు కుప్పలయినాయి. ఈ కుప్పల కుప్పల వూలను చూసుకొని మా అమ్మకు దిగులుపట్టుకునింది.

'దారినపొయ్యేవోళ్ళంతా మన వూలను చూసి కళ్లల్లో నిప్పలు పోసుకుంటా ఉన్నారు. దిష్టి చూవు తగిలితే బండరాళ్లే పగిలిపోతాయి. పచ్చటి చెట్టుదొక లెక్కా' అని మా నాయినమ్మతో చెప్పకునింది.

ఆ బయం మా నాయినమ్మకు యింతకు ముందరే ఉన్నట్టుంది... మా అమ్మ ఆ మాట అనీ అనకముందే నల్లటి మట్టికుండ తెప్పించి, దాని మీద సున్నపు బొట్లు పెట్టి చెట్టుమద్యలో దిష్టికి ఏలాడదీసింది.

అంతటితో మా అమ్మకు దిష్టి బయం పోయినా యాపార ఒత్తిడి ఎక్కవయ్యింది. తూర్పు యీది ఆడాళ్ళు, కొత్త కోమిటోళ్ళ ఆడోళ్ళు వచ్చి 'వూలు మాకీరాదా సత్తారా' అంటా... అబ్లీగేషన్‌లకు వచ్చి నారు. (మా అమ్మ పేరు సర్తాజ్. పాతూరులో చేరినాక ఆమె పేరు 'సత్తార' అయిపోయింది – నోరు తిరగక). కొత్త కోమిటోళ్ళ ఆడోళ్ళు యాపార మెళకువలు తెలిసినోళ్ళ కాబట్టి మా వూల రేటును వందొచ్చి ముప్ఫయ్ పైసలకు పెంచేసినారు – అడ్మాన్స్ పేమెంటును కూడా ఆశ చూపతా.

మా అమ్మ ఒంగలా.

'డబ్బుల కోసరమని కాదమ్మా. వూలు మీకి చ్చినానంటే పాపం మా ఖాతా ఆమె యిబ్బంది పడుతుంది. కావాలంటే రెండు మూడొందలిస్తా తీసికెళ్ళండి' అనేది. అట్టా రెండు మూడు వందలు, మరీ మొహమాట పెడితే నాలుగైదు వందలతో (వంద వూలు ముప్పయి పైసల లెక్కన) వాళ్లను వగదెగిచ్చుకునేది మా అమ్మ.

అయితే అలా నాలుగైదు వందల వూలు తగ్గినా కూడా రిహానాబీ నిష్ఠూరమాడేది.

'ఏందకా...నువు రీటయిల్లో అమ్మేస్తే బజార్లో మా మూరలు ఎవురు అడగతారు? ఎవురు కొంటారు?' అని, కొసెను చేసేది.

పాపం రిహానాబీ కోసరం మా అమ్మ ఎంత మానుకోవాలన్నా లీటెయిలు బిజినెసులో, ముఖ్యంగా హిందువుల పండగలప్పుడు ఎక్కువ వూలు అమ్మాల్సి వచ్చేది. (ఆ టైములో వంద అర్దరూపాయికి అడిగేవోళ్లు. అది రికార్డు రేటు!)

వూలు కోస్తానంటే చెట్టుమీద చెయ్యి వేయనివ్వదు గానీ కాయ దూయడానికి మాత్రం ఒకరికిద్దరిని పిలి చేది మా అమ్మ. సనజాజుల చెట్టంతా కాయ కట్టేసిందంటే కావు పడిపోద్ది గదా. అందుకని మా నాయినమ్మని, నన్ను మిద్దె ఎక్కనిచ్చేది. మేము మా అమ్మతో కలిసి యాడాడ కాయున్నా అదంతా దూసేసేవోళ్ళం.

ఈ డూటీ మ వాయినకు కూడా తప్పేది గాదు ఒకోసారి.

ఆయన ఏవాడైనా ఇంట్లో ఖాళీగా వుండి, ఒళ్ళు యిరుచుకుంటా ఉంటే మా అమ్మ ఊరుకోకుండా 'అట్టా కాళ్లు సావుకొని కూచోకపోతే మిద్దెనెక్కి కాయ దూయరాదా?' అనేది.

చెట్టు పని గదా. అడ్డం చెప్పేదానికేలా.

అయిన గమ్మున మిద్దెక్కి 'యింక చాల్లే..దా' అనేదాకా కాయ దూస్తానే ఉండేవాడు. కాయ దూసేకొద్దీ మరిగిన్ని వూలు వూస్తా వుండేది మా చెట్టు. మా వూల సంక్య వెమ్మది వెమ్మదిగా పదిహేడు వందలు, పద్దెనిమిది వందలు ఒకోసారి పందొమ్మిది వందలకు చేరిపోయేది. అయినాగానీ నాలుగు వూలకి దారం కట్టి తల్లో పెట్టుకునేది గాదు మా అమ్మ. 'యింకో వంద వూలు కాస్తే అచ్చంగా నాలుగు రూపాయిలు చేతిలో పడేవి గదా' అనేది ఆశగా. (రెండు వేల వూలు నాలుగు రూపాయలు)

యిట్టా రెండువేల వూల లక్షానికి మా యాపారం అబివృద్ది చేయాలని మా అమ్మా, మేమూ పాటుపడ తావుంటే అప్పడప్పుడు బంధువులొచ్చి పడేవోళ్లు మా వూలకి దుష్మన్లయి.

'యింటికొస్తే అంత పెద్ద చెట్టు పెట్టుకొని కూడా నాలుగు వూలియ్యలేదమ్మా ఆ మహాతల్లి' అని అమ్మలక్కలు అంటారుగదా... అందుకని ఆ మాట రానీకుండా ఆరోజు మాత్రం రిహానాబీకి యియ్యాల్సిన కోటాలో రెండొందల వూలు తగ్గించి దగ్గిరుంచుకునేది మా అమ్మ.

ఆ రొండొందల వూలని అట్టానే చేతిలో పెడితే ఎవురికంటికీ ఆనవుగదా. ఆ సంగతి మా అమ్మకు తెలుసు కాబట్టే యింటికొచ్చినోళ్ళని నైసుగా మాట ల్లోపెట్టి మా పెరట్లోని మరువం రెమ్మల్ని, కనకాం బరాలని కోసుకొవొచ్చేది. ఒక వాయ సన్నజాజులు, ఒక వాయ మరువం, ఒక వాయ కనకాంబరాల లెక్కన అన్నింటినీ కలిపి దూరం దూరంగా మాల కట్టేది. అప్పుడు ఆ రొండొందల వూలే రెండు మూడు మూరలై యింత పొడవున అవుపిస్తాయి.

యింక మా బంధువులూ కుష్‌మా అమ్మా కుష్.

ఒకోసారి మా అమ్మ ఏరోజు డబ్బులు ఆరోజు తీసుకుని కాదు – రిహానా కాణ్ణుంచి.

'అట్టా తీసుకుంటే ఏ పనికీ అక్కరకు రావ డంలేదమ్మా. వారం రోజుల డబ్బులు ఒకేసారి యియ్యి' అనేది రిహానాబీతో. వారం రోజుల పాటు వరసగా వూలిచ్చి, ఎనిమిదో రోజు యిరవై అయిదు రూపాయిలో ఇరవై ఆరు రూపాయిలో తెచ్చుకుని ఆ డబ్బుతో స్టోరులో చక్కెర తెచ్చుకనేది. అట్టా మా వూల డబ్బులు ఒక వస్తువు కోస రంగా ఉపయోగపడితే మా అమ్మ మొకం సంతోషంతో వెలిగిపోయేద.

'చూసినావా నా చెట్టు తడాఖా. నాలుగు రోజులు ఆగు. నా వూల డబ్బులతో అయిదు వేల చీటీ కట్టి చూపిస్తా' అని, మా నాయినతో చతుర్లాడేది మా అమ్మ. మా నాయిన ముసిముసి నవ్వులు నవ్వుకుంటా చూస్తా వుండేవోడు.

కత యిట్టా వూలువూలుగా జరగతావుండగా ఒక సారి మా అమ్మకూ, రిహానాకు తకరారు వచ్చేసింది – యిరవై రూపాయిల వూల డబ్బుల కాడ.

'నా అయిదు రోజుల వూల డబ్బులు యిచ్చెయ్ తల్లా. అవతల నాకు అర్జెంటు పనుంది' అంటుంది మా అమ్మ.

'యింకో రెండ్రోజులు తాలకా. యీ డబ్బులికి ఆ డబ్బులు కూడా కలిపి మొత్తమంతా యిచ్చే




స్తాను' అంటుంది రిహానా. అలా రెండు రోజులు గడిచినాయి. వూల బాకీ యిరవై ఆరు రూపాయి లయ్యింది. మళ్లా మా అమ్మ డబ్బులడిగింది.

'రేపురా అకా. గారంటీగా యిచ్చేస్తా' అనింది రిహానా.

అట్టాంటి గారంటీలు మళ్లా మూడయినాయి. యింక లాబం లేదనుకొని మరుసటి రోజు మరే దగావే అడిగింది మా అమ్మ– 'ఏందిమే రిహానా. నేను చెట్టు పెంచుకుని, నీళ్ళు పోసుకుని, పురుగు పట్టకుండా ముడతమందు చల్లుకొని, కాయ దూసు కుని నా వూలను ఒకటికి రెండింతలు చేసుకునింది నీ యదాన కొట్టడానికా? నువు డబ్బులియ్యకుండా ఇట్టా యిబ్బంది పెడితే ఎలాగమే' అనింది.

ఆ మాటలకి రిహానా ఏందో సర్దిచెప్పబోతా ఉంటే, వాళ్ళాయన గమ్మనుండబళ్ళా? యింత పొడుగున పొడుచుకొనొచ్చి 'యిచ్చేస్తాములేమ్మా... నీ సంబడం డబ్బులా. రేపు రాపో' అన్నాడు రోషంగా.

అంతే. అదే ఆఖరు. ఆ మరుసటి రోజు నుంచి మా అమ్మ రిహానా ఇంటికే ఎళ్లలా. వూలూ యివ్వలా.

చాన్నాళ్ల తరువాత మా అమ్మ తల్లో, మా చెల్లెలి తల్లో యిన్నేసి వూలు అవుపిస్తా ఉంటే మా నాయిన డౌటుపడి సంగతి తెలుసుకున్నాడు. 'పోనీలేమ్మే. పేదరాలు. ఏమి యిబ్బందుల్లో వుందో' అన్నాడు.

మా అమ్మ ఒదల్లా. మనసులోనే పెట్టుకునింది ఆ సంగతిని.

రెండు వారాలు గడిచినాయి. ఒకరోజు సాయింత్రం తల నిండుగా కొంగు కప్పకొని బితుకు బితుకు మంటా వచ్చింది రిహానా.

మా అమ్మ వరండాలో కూచొని ఉంది.

'ఏం తల్లా' అనింది, రిహానా తట్టు తుస్కారంగా చూస్తా.

'డబ్బులిచ్చి పోదామని వచ్చినానకా' అనింది రిహానా.

'మాకేం బళ్లేదు పో' అనింది మా అమ్మ.

రిహానా పోలా. గమ్మిగా వచ్చి మా అమ్మ పక్కన కూచునింది– కళ్ళు నిండా నీళ్లు నింవుకుంటా.

'సేయ్ పిచ్చిదానా' అనింది మా అమ్మ, రిహానా కళ్లల్లో నీళ్లు చూసి.

'అకా. సత్తెం చెప్తా ఉన్నా. ఇన్ని రోజులు నీకాడికి రాకపోవడానికి డబ్బులు దొరక్కపోవడమే కారణం. నీకియ్యాల్సింది యియ్యకుండా ఏ మొకం పెట్టు కొని వచ్చేది చెప్పకా? ఈ పదిరోజులుగా చేతిలో నయాపైసాలాక నీబోటోళ్ళ దగ్గిర వంద రెండొందల వూలు కూడా కొనడంలా. నేమా మా ఇంటాయన పెద్దవూల కొట్లకాణ్ణించి వూలు దెచ్చుకుని, పొగులు పొద్దస్తం మూరలు కట్టి, మూరకు పదిపైసల లెక్కన అయిదో పదో సంపాదించినా అయి బిడ్డల జరాలకే అయిపోతా ఉన్నాయి. నిజంగానే కర్మ పట్టిందకా మాకు. మొన్న మా ఇంటాయన శ్రావణమాసం సీజనుగదా రెడిమేడ్ దండలు అమ్ముడుపోతాయి అని అరువులో వూలుదెచ్చినాడు. రెడిమేడ్ దండలు కట్టినాం. బేరాలు రాలా. సగం కూడా అమ్ముడు పోలా. మరుసటి రోజు అమ్ముకునేదానికి అయి కట్టెలు కాదుగదకా. ఏం చేసేది? కట్టిన దండల న్నింటినీ చేతులారా వరదలో పారేసినాము. యిట్టా ఏం వస్తదో ఏంరాదో తెలీని వూలమ్ముకునే బతు కులు పగోనికి కూడా వద్దకా' అంటా కడుపులోని బాదంతా కరిగిపోయేలా ఏడ్చింది రిహానా.

ఆ వూలమ్మే ఆమె బాద చూసి ఈ వూలమ్మే ఆమె ఏమి చేయగలదు– కళ్ళమ్మట నీళ్లు నింవుకోవడం తప్ప. ★